రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం..!



భీమారం: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలోని మట్టిరోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం ఉండటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందని స్థానికులు తెలిపారు. రోడ్డు చిన్నదిగా ఉన్న సమయంలో విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయగా, రానురాను రోడ్డు వెడల్పు చేయడంతో నేడు స్తంభం నడిరోడ్డు మధ్యలోకి వచ్చిందని వారు తెలిపారు. సీసీ రోడ్డు మంజూరైనా, స్తంభం కారణంగా రోడ్డు నిర్మించడం లేదని పేర్కొన్నారు. స్తంభం తొలగించి మరోచోట ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

మట్టి రోడ్డు కాదు.. సీసీ రోడ్డే..!



చెన్నూర్‌రూరల్: మండలంలోని లింగంపల్లి గ్రామంలోని ఎస్టీ కాలనీకి వెళ్లేందుకు గతంలో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు అధ్వానంగా మారింది. సీసీ రోడ్డు మొత్తం పగుళ్లు తేలి గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డుపై గుంతల్లో నీరు నిలిచి మట్టి ఏర్పడి సీసీ రోడ్డు ఆనవాళ్లు పోయి మట్టి రోడ్డును తలపిస్తోంది. సంబంధిత అధికారులు పట్టించుకొని నూతనంగా రోడ్డును నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్టీసీ బస్టాండ్ అధ్వానం



చెన్నూర్: చెన్నూర్ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం అధ్వానంగా మారింది. బస్టాండ్ ఆవరణలో వర్షపు నీరు నిలువడంతో ఆ ప్రాంతమంతా బురదమయంగా మారింది. మరుగుదొడ్లు, మూత్ర శాలల సమీపంలో నీరు నిలువడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి నీరు నిలువకుండా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వరద తగ్గింది.. బురద మిగిలింది

భారీ వర్షాలకు వాగులు పొంగిపొర్లాయి. వరద ఉధృతికి భీమిని, కన్నెపల్లి మండలాల్లో పత్తి, వరి, పంటలు నీటమునిగాయి. వరద ప్రవాహం తగ్గినప్పటికీ, బురద మాత్రమే మిగిలింది. భీమిని మండలంలోని చిన్నతిమ్మపూర్, తంగళ్లపల్లి, వెంకటపూర్, సాలీగాం, మాడవెల్లి గ్రామాల్లో, కన్నెపల్లి మండలంలోని లింగాల, చింతపూడి, నాగెపల్లి, వీరాపూర్ గ్రామాల్లోని పత్తి, వరి పంటలు నీటమునిగి ఇసుక మేటలు వేశాయి. దీంతో తీవ్ర నష్టం వాటిల్లింది. ఏటా పీపీ రావు ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌తో చిన్నతిమ్మపూర్, తంగళ్లపల్లి, సాలీగాం గ్రామాల పంటలు నీట మునుగుతున్నాయని, ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని వేడుకున్నారు. – భీమిని





చింతపూడి శివారులో పత్తిలో ఇసుక మేటలు



పంటలు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్

దండేపల్లి: నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు లక్సెట్టిపేట సీఐ రమణమూర్తి తెలిపారు. దండేపల్లిలో గురువారం తెల్లవారుజామున పలు ఇళ్లలో పోలీసులు సోదాలు చేశారు. ధృవపత్రాలు లేని 35బైక్‌లు, 3 ఆటోలు సీజ్ చేశారు. 4లీటర్ల గుడుంబా పట్టుకున్నారు. అనంతరం హనుమాన్ టెంపుల్ సమీపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడారు. సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లోకి ఎవరైనా కొత్త వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, ఈ విషయంలో తల్లిదండ్రులు కూడా పిల్లలపై దృష్టిసారించి వారు పెడదారి పట్టకుండా చూడాలన్నారు. గంజాయి విక్రయించినా, తాగినా చర్యలు తప్పవన్నారు. క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడవద్దన్నారు.



మాట్లాడుతున్న సీఐ రమణమూర్తి

మహిళలపై ఎవరైన అసభ్యంగా ప్రవర్తిస్తే షీటీంకు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం వాహనాల ధృవపత్రాలను సరిచేసుకోవాలని కొంత గడువు ఇచ్చి, సొంత పూచీకత్తుపై ఎవరి వాహనాలు వారికి అప్పగించారు. దండేపల్లి, లక్సెట్టిపేట, జన్నారం ఎస్సైలు తహాసీనొద్దీన్, సురేష్, అనూషతో పాటు మూడు స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి



రోగులతో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్

చెన్నూర్: జిల్లాలో అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై వైద్యులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కమ్యూనిటీ హెల్త్ సూపరింటెండెంట్ కోటేశ్వర్‌రావు అన్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య సేవల కోసం ఆసుపత్రికి వచ్చిన రోగులకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. వైద్యులు సత్యనారాయణ పాల్గొన్నారు.

వంతెన నిర్మాణ పనులు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్, కాంగ్రెస్ నాయకులు

నెన్నెల: మండలంలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి లంబాడితండా ఎర్రవాగు తాత్కాలిక వంతెన పూర్తిగా కొట్టుకుపోవడంతో ఎనిమిది గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. నూతన వంతెన పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రకాష్, కాంగ్రెస్ నాయకులు హరీష్‌గౌడ్, గట్టు మల్లేష్ గురువారం బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు. ఆ కాంట్రాక్టర్‌తో మాట్లాడి నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా మొరం, కంకర పోయాలని చెప్పారు. దీంతో తాత్కాలికంగా సమస్య పరిష్కారమైంది.

కాలువకు మరమ్మతులు చేపట్టాలని వినతి



డీఈ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం ఇస్తూ...

జన్నారం: కవ్వాల్ రాముని చెరువుకు నీరందేలా మత్తడివాగు నుంచి వచ్చే కాలువకు మరమ్మతులు చేయించాలని, కాలువ తెగిపోవడంతో నీరంతా వృథాగా పోతోందని కవ్వాల్ గ్రామ రైతులు జన్నారం ఇరిగేషన్ కార్యాలయం ఎదుట గురువారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డీఈ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. రైతులు పోశగౌడ్, సక్రునాయక్, శ్రీనివాసనాయక్, మహమూద్, వెంకటేశ్, దుబ్బయ్య, రాజయ్య, గంగన్న పాల్గొన్నారు.

భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

భీమారం: రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గురువారం తహసీల్దార్ సదానందం ప్రజలను కోరారు. మండలంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించిందని, ఈ నేపథ్యంలో గుడిసెల్లో నివసించేవారు ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని కోరారు. వాగులు ఉప్పొంగితే అందులోకి వెళ్లి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దన్నారు. వర్షాల కారణంగా విద్యుత్ ఇబ్బందులు ఏర్పడితే రెవెన్యూ, పోలీస్‌శాఖ దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ ప్రజలకు సూచించారు.

కేజీబీవీ సందర్శన



స్టాక్ రిజిస్టర్ పరిశీలిస్తున్న ఎంపీడీవో

వేమనపల్లి: మండలంలోని నీల్వాయిలో ఉన్న కేజీబీవీని ఎంపీడీవో కుమారస్వామి గురువారం సందర్శించారు. పాఠశాలలోని అటెండెన్స్, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించి రోజువారీ మెనూను అడిగి తెలుసుకున్నారు. వంటగదిని పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యదర్శి అశోక్, ఉపాధ్యాయులు ఉన్నారు.

గో విజ్ఞాన పరీక్షకు అవకాశం కల్పించాలి

మంచిర్యాలటౌన్: ఓహే వైష్ణవ తకురా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వచ్చే నెల సెప్టెంబర్‌లో నిర్వహించే గో విజ్ఞాన పరీక్షలకు విద్యార్థులకు అవకాశం కల్పించాలని కోరుతూ విశ్వ హిందూ పరిషత్ సభ్యులు గురువారం డీఈవో యాదయ్యకు వినతిపత్రం అందించారు. మొదటి బహుమతి రూ.1లక్ష, రెండో బహుమతి రూ.50వేలు, మూడో బహుమతి రూ.25వేలు ఉంటుందని, విద్యార్థులు పాల్గొనేందుకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్రీయ హిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర లీగల్ అడ్వైజర్ నటేశ్వర్ కొట్టే, బీజేపీ సీనియర్ నాయకులు కిషోర్‌లు పాల్గొన్నారు.



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న వీహెచ్‌పీ సభ్యులు

ముందస్తు చర్యలు, అభివృద్ధిపై సమీక్ష

మంచిర్యాలరూరల్(హాజీపూర్): వర్షాకాలంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై గురువారం ఐడీఓసీ కార్యాలయంలోని డీపీవో ఛాంబర్‌లో సమీక్ష జరిపారు. క్షేత్రస్థాయి అధికారుల తనిఖీలు, పంచాయతీ కార్యదర్శుల హాజరు, పౌరసేవలు, 15వ ఆర్థిక సంఘం ద్వారా విడుదలైన నిధుల వినియోగం, ఆడిట్, పంచాయతీల్లో చేపడుతున్న పారిశుద్ధ్య పనులు తదితర కార్యకలాపాలపై చర్చించారు. సమావేశంలో డివిజినల్ పంచాయతీ అధికారులు, మండల పంచాయతీ అధికారులు, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న డీపీవో

దుకాణాల తనిఖీ



వస్తువులను పరిశీలిస్తున్న విజయ్‌కుమార్

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ప్లాస్టిక్, సానిటరీ, కిరాణ దుకాణాలను జిల్లా ఇన్‌చార్జి, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ గురువారం తనిఖీలు నిర్వహించారు. సరుకులు, వస్తువుల క్వాలిటీ గడువు తేదీలను పరిశీలించారు. కృష్ణ దుకాణం యజమానికి రూ.5000, లక్ష్మి సానిటరీ దుకాణం వారికి రూ.10,000 జరిమానా విధించారు.

రేపు వాలీబాల్ ఎంపిక పోటీలు

మంచిర్యాలఅర్బన్: పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 16న అండర్–15 విభాగం బాలబాలికల వాలీబాల్ ఎంపిక పోటీలు జన్నారం జెడ్పీహెచ్ఎస్ బాయ్స్ పాఠశాలలో జరుగుతుందని ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ ఎండీ యాకూబ్ తెలిపారు. పూర్తి వివరాలకు పోటీల కన్వీనర్ జన్నారం మండల విద్యాధికారి, జన్నారం జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎంను సంప్రదించాలన్నారు.

సమగ్ర వ్యాధి నిర్ధారణ వైద్య శిబిరం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నగరంలోని అరుణక్క నగర్ ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సమగ్ర వ్యాధి నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. 62మంది రోగులకు శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి, 34మందిని ఎక్స్‌రే కోసం మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో వైద్యురాలు పద్మశ్రీ, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, సీహెచ్‌వో నాందేవ్, సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్‌రావు, ఎస్‌టీఎస్ సాయిరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ మమత, సీహెచ్‌వో రమేశ్, ఐసీటీసీ కౌన్సిలర్ శ్రీలత, అక్తర్, ఏఎన్ఎంలు వజ్ర, రజిత, సునంద, అలేఖ్య, రేష్మ పాల్గొన్నారు.



వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఎస్టీపీపీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

జైపూర్: సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ఆధ్వర్యంలో జైపూర్ మండలంలోని పెగడపల్లి గ్రామంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఈడీ చిరంజీవి, జీఎం ఎస్టీపీపీ శ్రీనివాసులు, జీఎం(పీసీఎస్) నరసింహారావు, డీజీఎం పర్సనల్ కిరణ్‌బాబు, డాక్టర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

17న ఉచిత ఆర్థోపెడిక్ వైద్య శిబిరం

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని చున్నంబట్టివాడలోని లయన్స్‌క్లబ్ కార్యాలయంలో ఈ నెల 17న ఉచిత ఆర్థోపెడిక్(కీళ్లు, ఎముకలు, మోకాలి నొప్పి, తుంటి నొప్పి) వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ మంచిర్యాల శాఖ అధ్యక్షుడు చంద్రమౌళి తెలిపారు. వైద్యశిబిరంలో కీళ్లు, ఎముకల వైద్య నిపుణులు డాక్టర్.రాకేష్, కొమురవెల్లి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. మంచిర్యాల పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా గురువారం లయన్స్ క్లబ్‌లో సభ్యులు వైద్య శిబిరం పోస్టర్ ఆవిష్కరించారు.

సంక్షిప్త వార్తలు

18న సర్దార్ సర్వాయి పాపన్న జయంతి

మంచిర్యాలటౌన్: ఈ నెల 18వ తేదీ ఉదయం 11గంటలకు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను నస్పూరులోని సమీకృత జిల్లా కార్యాలయ భవన సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ.పురుషోత్తం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

పోస్టర్ ఆవిష్కరణ

లక్సెట్టిపేట: కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఈ నెల 20వ తేదీన టీయూసీఐ హమాలీ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని గురువారం మండలంలోని హమాలీలు స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వద్ద పోస్టర్ ఆవిష్కరించారు. మండలంలోని హమాలీలు పెద్దమొత్తంగా హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్ కోరారు. నాయకులు మల్లేష్, చంద్రయ్య, నరేష్, తిరుపతిరాజు, మహేష్, కొమురయ్య, శ్యామ్ పాల్గొన్నారు.

ముగింపు సభ జయప్రదం చేయండి

వేమనపల్లి: కోటపల్లి మండలం జనగామలో ఈ నెల 16న నిర్వహించనున్న అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవ ముగింపు సభను జయప్రదం చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు రాజేశ్వరి అన్నారు. బుయ్యారంలో గురువారం కులస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు.

పిచ్చిమొక్కల తొలగింపు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని రాముని చెరువు కట్టపై పెరిగిన పిచ్చి మొక్కలను స్వచ్ఛంద పౌరసేవా సంస్థ సభ్యులు గురువారం తొలగించారు. రంగారెడ్డి జిల్లా రిటైర్డ్ జడ్జి రాజన్న మాట్లాడుతూ.. చెరువును కాపాడుకునేందుకు ప్రజలు ముందుకు రావడం సంతోషకరమని, అధికారులు చెరువు అభివృద్ధిపై దృష్టిసారించాలన్నారు.

ఎస్సీ కాలనీ ముంపు సమస్య పరిష్కరించండి


తాండూర్: మండలంలోని బోయపల్లి గ్రామం ఎస్సీ కాలనీలో నెలకొన్న ముంపు సమస్యను పరిష్కరించాలని ఆ కాలనీవాసులు కోరారు. తాండూర్ తహసీల్దార్ జోత్స్న, ఎంపీడీవో శ్రీనివాస్‌లకు గురువారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ మాసాడి తిరుపతి, మాజీ సర్పంచ్ సుందిళ్ల భూమయ్య, స్థానిక నాయకులు వేల్పుల శంకర్, స్థానికులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి

తాండూర్: యూనియన్ బ్యాంకు ద్వారా ఖాతాదారులకు అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంకు తాండూర్ బ్రాంచ్ ఫీల్డ్ ఆఫీసర్ ఆశిష్ కుమార్ అన్నారు. మండలంలోని కొత్తపల్లిలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ పర్యటన

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ 18వ వార్డులో గురువారం మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేశ్ పర్యటించారు. వార్డు పరిధిలోని వీధులన్నీ కలియతిరిగి మురికి నీటి కాలువలు, లోపించిన పారిశుద్ధ్యం తదితర సమస్యలను స్వయంగా పరిశీలించారు. కాలువల్లో దోమలు వృద్ధి చెందకుండా పారిశుద్ధ్య సిబ్బందితో బ్లీచింగ్ చల్లించి, బైటెక్స్ స్ప్రే చేయించారు. ఈ సందర్భంగా వార్డు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మాజీ కౌన్సిలర్ వొడ్నాల రాజేశం, బస్తీ వాసులు కె.శ్రీనివాస్, మనోహర్, భాస్కర్, తిరుపతి, రాజేశ్వరి, చిరంజీవి తదితరులు వినతిపత్రం అందజేశారు.



జాతీయ గీతం ఆలపిస్తూ...

జనహిత సేవా సమితి, పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి రోజు ఉదయం 8గంటలకు మైక్‌లో జాతీయ గీతం వస్తుంది. కమిషనర్ పర్యటనలో ఉండగా జాతీయ గీతాలాపన రావడంతో మున్సిపల్ కమిషనర్ రమేశ్, ఇన్‌చార్జీ సానిటరి ఇన్‌స్పెక్టర్, బస్తీవాసులు బజారు ఏరియా రోడ్డుపై ఆగి జనగణమన గీతాలాపన చేసి దేశ భక్తిని చాటుకున్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

కొనసాగుతున్న ఎండీటీ సమావేశాలు

శ్రీరాంపూర్: సింగరేణి స్థితిగతులను తెలియజేసి, ఉత్పత్తి లక్ష్యాల పెంపుదల కోసం ఏర్పాటు చేసిన మల్టీ డిపార్ట్‌మెంట్ (ఎండీటీ) సమావేశాలు కొనసాగుతున్నాయి. శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 5, ఆర్కే న్యూటెక్ గనులపై గురువారం ఈ సమావేశాలు నిర్వహించారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో ఏరియా జీఎం శ్రీనివాస్, ఎండీటీ టీంల కన్వీనర్లు సత్యనారాయణ, రవికుమార్‌లు మాట్లాడారు. ఎండీటీ సమావేశాలు ఎందుకు ఏర్పాటు చేశారో వివరించారు. కంపెనీలో యంత్రాల పనిగంటలు మరింత పెరగాలన్నారు. భూగర్భ గనుల్లో ఉత్పత్తి పెరుగుతేనే నష్టాలు తగ్గుముఖం పడతాయన్నారు. నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వేరువేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీ సైదా, అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, డీజీఎం రాజన్న, గని మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

మెడికల్ బోర్డును సమీక్షించాలి

శ్రీరాంపూర్: ఇటీవల నిర్వహించిన మెడికల్ బోర్డును తిరిగి సమీక్షించాలని జీఎల్‌బీకేఎస్ రాష్ట్ర నాయకులు తాళ్లపల్లి శ్రీనివాస్, మేకల రామన్నలు యాజమాన్యాన్ని కోరారు. ఈ మేరకు గురువారం ఏరియా జీఎం శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. మెడికల్ బోర్డులో మెడికల్ అన్‌ఫిట్ కావాల్సిన వారిని ఫిట్ చేశారన్నారు. చాలా మంది జబ్బుపడ్డ వారికి అన్యాయం జరిగిందన్నారు. దీనిపై కంపెనీ తిరిగి బోర్డు ఏర్పాటు చేసి ఫిట్ ఫర్ డ్యూటీ ఇచ్చిన వారిని పిలిచి పరీక్షించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కామెర్ల దేవయ్య, సురేందర్‌లు పాల్గొన్నారు.

జీఎం కార్యాలయం ఎదుట ఐఎన్‌టీయూసీ ధర్నా

రామకృష్ణాపూర్: ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో మందమర్రిలోని జీఎం కార్యాలయం ఎదుట గురువారం సాయంత్రం ధర్నా చేపట్టారు. యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య మాట్లాడుతూ.. జూలై 31 మెడికల్ బోర్డు నిర్ణయాలను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని, అండర్ గ్రౌండ్‌లో పనిచేస్తూ అనారోగ్యంతో అన్‌ఫిట్ అయిన కార్మికులకు సూటబుల్ జాబ్ ఇవ్వాలని, సింగరేణి కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయాలన్నారు. సంస్థ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నూతన భూగర్భ గనులను ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మిట్ట సూర్యనారాయణ, నరేందర్, బుచ్చయ్య, చారి, ఓదెలు, చంద్రశేఖర్, ఆంజనేయులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న నాయకులు

'అధికారులూ.. న్యాయం చేయండి'

తాండూర్: ప్రభుత్వం భూ పంపిణీలో మన్నేవార్లకు కేటాయించిన భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడి, వారికి తగు న్యాయం చేయాలని కొలవార్ సంఘం మండల ప్రధాన కార్యదర్శి రమేశ్, ట్రైబల్ ఎన్జీవో విజయ కోరారు. తాండూర్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం మాట్లాడారు. 2005లో కత్తెర్ల శివారులోని సర్వే నంబర్ 9లో 21 మంది మన్నేవార్లకు భూ పంపిణీలో ప్రభుత్వం భూమికి కేటాయించినట్లు తెలిపారు. ఇన్ని సంవత్సరాలుగా భూమి సాగు చేసుకుంటున్న మన్నేవార్ల భూములను ఇటీవల వెంకటేషం, వేణుగోపాల్, రాజలింగు అనే వ్యక్తులు దౌర్జన్యంగా ఆక్రమించి భూమి సాగు చేసుకుంటున్నారని, ఇదేమిటని ప్రశ్నిస్తే భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వాపోయారు. అధికారులు స్పందించి మన్నేవార్లు సాగు చేసుకుంటున్న భూమి వారికే చెందేటట్లు, న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాంతమ్మ రాజుబాయ్, మల్లక్క, రెబ్బెన సత్తమ్మ, ఎలిగేటి సుజాత, ఎడ్ల రాజేశ్వరితో పాటు పట్టేదారులు పాల్గొన్నారు.